క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి పావని

బూర్జ: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఐ.పావని అన్నారు. మండలంలోని పాలవలస గ్రామ సచివాలయం, పాలవలస పంచాయతీ, రామన్నపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 61 మంది రోగులకు వైద్య సేవలందించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, సుగర్‌తో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: రక్త దానం చేసేందుకు ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని విశ్రాంత తహసీల్దార్ యు.లింగరాజు పిలుపునిచ్చారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌ను గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఇందిరానగర్ సిద్ధాశ్రమం వద్ద ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి లింగరాజు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడినవారు అవుతారన్నారు. కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో ముమ్మరంగా ఫీవర్ సర్వే



ఫీవర్ సర్వేను చేస్తున్న వైద్య సిబ్బంది

పొందూరు: మండల కేంద్రంలోని పొందూరులో తాడివలస పీహెచ్‌సీ వైద్య బృంది గురువారం ముమ్మరంగా ఫీవర్ సర్వే నిర్వహించారు. పొందూరులోని పార్వతీనగర్ కాలనీలో రెండు రోజుల క్రితం ముగ్గురికి వైరల్ ఫీవర్ సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ సర్వేలో మరొకరికి వైరల్ ఫీవర్ లక్షణాలు ఉండటంతో తాడివలస పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్‌నాయుడు రక్త పరీక్షలను నిర్వహించారు.

వివాదాలు సృష్టిస్తే కేసులు నమోదుచేస్తాం



గోకర్నపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

పొందూరు: ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎవరైనా వివాదాల జోలికి వెళ్తే బైండోవర్ కేసులు ఎదుర్కోవలసి వస్తుందని ఆమదాలవలస సీఐ దివాకర్ హెచ్చరించారు. ఎన్నికల దృష్ట్యా మండలంలోని వివాదాస్పదమైన గోకర్నపల్లి, గోరింట, తాడివలస గ్రామాలను గురువారం సందర్శించారు. శాంతిభ్రతలకు విఘాతం కల్పిస్తే కేసులు నమోదేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎస్‌ఐ రవికుమార్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌పీఓ రవిబాబు

ఆమదాలవలస: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ, రొటేరియన్ జె.రవిబాబు అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం, అరుణోదయ రూరల్ డవలెప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా రెండురోజులుగా బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలను పట్టణంలో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు గురువారం రవిబాబు బహుమతులు అందజేశారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం వలంటీర్, సహాయ కార్యదర్శి కేసారం అప్పలరాజు, గౌతం పవన్, అరుణోదయ సంస్థ డైరెక్టర్ జి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో..

పేదల చదువుకు భరోసా



కణుగులవలసలో నాడు-నేడు పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు
- రైతుల సేవలో రైతు భరోసా కేంద్రాలు
- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం బలోపేతానికి చేపడుతున్న సంక్షేమ పథకాలు పేదల చదువులకు చక్కని భరోసా కల్పిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో కణుగులవలస గ్రామంలో రూ.31.75 లక్షల వ్యయంతో నిర్మించిన నాడు-నేడు పాఠశాల భవనాలను, రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగితే ఉత్తమ ఫలితాలు సాధించగలరన్నారు. నేటీ పోటీ ప్రపంచంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించడం వల్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఆస్కారం కలుగుతుందన్నారు.

రానున్న రోజుల్లో విద్యారంగం రాష్ట్రంలోనే మన జిల్లా అగ్రగామిగా నిలుస్తోందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో బలోపేతం చేయడం జరిగిందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలను విద్యార్థులకు కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే భావనతో జగనన్న ఆలోచించి విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. అమ్మఒడి పథకం, విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాల ద్వారా పేదల చదువులకు భరోసా కల్పిస్తున్నారని గుర్తుచేశారు. జగనన్న పాలనలో చదువుల విప్లవాన్ని గ్రామస్థాయిలోనే తీసుకువచ్చామన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చేది పెద్ద ఆస్తి చదువుగా గుర్తించి అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పేదరికం విద్యకు అడ్డం కాకుండా సీఎం జగన్ విద్యా రంగాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని తెలిపారు.

రైతులకు గ్రామస్థాయిలోనే నిత్యం సేవలు అందించాలన్న ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని అభివృద్ధి బాటలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడిపిస్తోందన్నారు. విత్తనం నుంచి, విక్రయం వరకు అన్ని విధాలుగా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ జయప్రకాశ్, వ్యవసాయశాఖ ఏడీఏ బగ్గు రజని, ఏఓ మోహనరావు, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పొన్నాడ అనుసూయమ్మ, మండల సచివాలయాల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్



పొందూరు: మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

ఆమదాలవలస: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మార్చి 9వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం వాయిదా పడింది. మార్చి 16వ తేదీన నిర్వహించనున్నట్లు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షదారులందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు. లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పొందూరు: ఈ నెల 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16న జరుగనుందని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బీ.జ్యోత్స్న తెలిపారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో గురువారం విలేకరులతో మాట్లాడారు. వరుస సెలవులు కారణంగా లోక్ అదాలత్ వాయిదా పడిందన్నారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: పాలపోలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: ఉమాసోమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కొరసవాడ మార్కెట్‌లో ఉన్న ఉమాసోమేశ్వర ఆలయం (శివాలయం) పునఃప్రతిష్ట మహోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. హోమాలు, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఎం.గణపతిరావు, కోఆప్షన్ సభ్యుడు పుల్లాయ్, సర్పంచ్‌లు జక్కర ఉమ, నల్లి జగదీశ్వరరావు, ఎంపీటీసీ ఎం.సుగుణకుమారి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, వీవర్స్ జిల్లా అధ్యక్షుడు మంచు చంద్రయ్య, మొర్రి లోకేశ్వరరావు, ఎం.రామకృష్ణ, నారాయణ స్వామి, కొరసవాడ, కాగువాడ గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పెద్దలక్ష్మీపురం గ్రామంలో..

మెళియాపుట్టి: ఆధ్యాత్మిక భవాలను ప్రతిఒక్కరూ పెంచుకోవాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గ్రామంలో పాలపోలమ్మ తల్లి గ్రామ దేవత ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో మరోసారి ఏపీకి సీఎంగా జగనన్నను చేయాలని కోరుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభం



సాగు విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: ప్రకృతి వ్యవసాయం వరమని ఆ విభాగం స్టేట్ రిసోర్స్‌పర్సన్ దేవుళ్లు అన్నారు. కిట్టాలపాడులో ప్రకృతి వ్యవసాయ సాగు విధానాన్ని పరిశీలించారు. నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, ఎన్ఎఫ్ఏ మునసయ్య, ఎంటీ సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జి లత, ఐసీఆర్పీలు జోగారావు, శ్రీనివాసరావు, ఢిల్లేశ్వరరావు, దమయంతి పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర రోడ్డులో చేపడుతున్న మరమ్మతు పనులను ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు గురువారం పరిశీలించారు. మండల పరిషత్ నిధులతో చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. సర్పంచ్ అగతమూడి రంజిత్ కోరిన వెంటనే రహదారి మరమ్మతులు చేస్తున్నట్లు వైస్ ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంటిభద్ర ఎంపీటీసీ సభ్యురాలు అగతమూడి సుశీల, ప్రత్యేక ఆహ్వానితులు ప్రశాంత్ కర్లెమ్మ ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ అప్పారావు, పార్టీ నాయకుడు సవర రమేష్ పాల్గొన్నారు.

48 మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లు

కొత్తూరు: మండలంలోని మాతల బస్టాండ్ వద్ద స్థానిక ఎస్‌ఐ ఎం.ఎ.అహమ్మద్ తన సిబ్బందితో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 48 ఒడిశా మద్యం బాటళ్లతో ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుకున్న వారిలో కొత్తూరు మండలం మావకరం గ్రామానికి చెందిన ఎస్.తిరుపతిరావు, విజయనగరం జిల్లా ఆర్.ఎ.వలస గ్రామానికి చెందిన బి.సురేష్ ఉన్నారు. మద్యం బాటళ్ల స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయంలో (మెళియాపుట్టి) ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.రాధకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతికి (ఆంగ్ల మాధ్యమంలో సీబీఎస్ఈ సిలబస్) ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 6వ తరగతిలో బాలురుకు 30 సీట్లు, బాలికలకు 30 సీట్లు, 7వ తరగతిలో బాలురుకు రెండు సీట్లు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు ఏకలవ్య మోడల్ పాఠశాల సమయంలో సంప్రదించాలన్నారు.

మేం సిద్ధం.. మా బూత్ సిద్ధంపై సమావేశం నేడు

ఎల్.ఎన్.పేట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం అనే అంశంపై పాతపట్నం నియోజకవర్గం స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పోలింగ్ బూత్ ఏజెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను), వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్, పార్టీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం తదితరులు పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు పాతపట్నంలోని ఓ కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని కోరారు.

ల్యాప్‌టాప్‌ల వితరణ



ప్రిన్సిపాల్‌కు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న గరిమెళ్ల ట్రస్టు సభ్యులు

పోలాకి: మండలంలోని ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్వతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ మేనల్లుడు, విశ్రాంత ఉద్యోగి డాక్టర్ ఇ.వి.రఘునాథరావు రెండు ల్యాప్‌టాప్‌లు వితరణగా ఇచ్చారు. స్థానిక గరిమెళ్ల ట్రస్టు కార్యదర్శి బాడాన రాజు, కోశాధికారి దుబ్బ కోటేశ్వరరావులు వీటిని కళాశాల ప్రిన్సిపాల్ జి.నాగేంద్రశర్మకి గురువారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరిమెళ్ల పేరుమీద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తమ వంతుగా కృషిచేస్తామన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాల, కళాశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేశారు.


ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ బి.సుధాకర్

హిరమండలం: ఎన్నికలకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని తహసీల్దార్ బి.సుధాకర్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో గురువారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలను తెలుసుకున్నారు. కల్లట పోలింగ్ కేంద్రం పరిధిలోని జిల్లేడుపేటకు చెందిన 277 ఓటర్లకు ప్రత్యేకంగా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతకాపల్లి ఇప్పగూడకు చెందిన 143 మంది ఓటర్లకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



గాజులకొల్లివలసలో కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఆమదాలవలస రూరల్: గ్రామాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు తగు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. మండలంలో గాజులకొల్లివలస సబ్‌స్టేషన్ నుంచి కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సబ్‌స్టేషన్ పరిధిలోకి కొన్ని గ్రామాల విద్యుత్ లైన్లను మార్చడం కోసం కొత్త లైన్ల ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు, ఇండస్ట్రియల్ ఏరియాకు, వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త లైన్ల ఏర్పాటు వల్ల విద్యుత్ సరఫరా అంతరాయాన్ని నివారించడానికి ఆస్కారం కలుగుతుందన్నారు. ఈ పరిశీలనలో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎనర్జీ అసిస్టెంట్ జోగారావు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: అన్ని వర్గాల ప్రజల కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని ఎం.జగన్నాథపురంలో గురువారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేస్తున్న అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, వైఎస్సార్ పెన్షన్ కానుకతోపాటు మహిళల అభివృద్ధికి, రైతుల కోసం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలంటే సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సచివాలయాల ద్వారా అర్హులకు సంక్షేమ పథకాలను గ్రామ వలంటీర్ల ద్వారా నేరుగా అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. సీఎం జగనన్న వల్ల తమకు ఎంతో మేలు జరిగిందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలియజేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి శ్రావణ కుమార్, సర్పంచ్, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పార్టీ నాయకులు రాజులునాయుడు, పంకజదాస్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొత్తూరు: మండలంలోని వసప గ్రామ వలంటీర్ కొయిలాపు తిరుపతిరావు ఇచ్చిన సమాచారం మేరకు భారీ అగ్నిప్రమాదం తప్పింది. వసప గ్రామం కొండ వీధి చివరలో చెత్త కుప్పకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం నిప్పుపెట్టారు. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడటంతో సమీపంలో ఉన్న ఇళ్లకు వ్యాపించాయి. ఈ విషయాన్ని వీఆర్వో గిరీష్ పట్నాయక్‌కు వలంటీర్ సమాచారం చేరవేశారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకొండ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తంగా వ్యవహరించిన వలంటీర్‌ను గ్రామస్తులు అభినందించారు.

రూ.56.29 కోట్ల అంచనా బడ్జెట్ ఆమోదం



బడ్జెట్ వివరాలను సభ్యులకు వివరిసున్న ఏఓ రాంబాబు

కొత్తూరు: స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన గురువారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.56,29,89,150 అంచనా బడ్జెట్‌ను, 2023-24కు చెందిన రూ.54,56,61,44 సవరణ బడ్జెట్‌ను ఆమోదించారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో 2023-2024లో మండల పరిషత్ ఖాతాకు ప్రభుత్వం నుంచి వివిధ పద్దులు, జమైన నిధుల వివరాలతోపాటు అభివృద్ధి పనులు, ఉద్యోగుల జీత భత్యాలు, ఖర్చుల వివరాలను కార్యాలయం ఏఓ బసవ రాంబాబు సభ్యులకు చదివి వినిపించారు. 2024-25కు ప్రభుత్వం నుంచి మండల పరిషత్‌కు జమ కానున్న అంచనా ఆదాయ వివరాలను తెలియజేశారు. ఈ ఏడాదిలో ఖర్చు చేయాల్సిన వివరాలను వివరించారు. వేసవి తీవ్రతరం కాకముందే గ్రామాల్లో బోర్లు మరమ్మతులతోపాటు జల్ జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న ఇంటింటికీ కుళాయి పనులు పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మణికంఠకు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నందున నీటి సౌకర్యం కల్పించాలని జేఈకి కోరారు. కంతమానుగూడ, గొట్టిపల్లితోపాటు పలు గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ-2 మెండ సునీత, ఈఓపీఆర్డీ కృష్ణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు అంపిలి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

3న పల్స్ పోలియో

సారవకోట: ఈ నెల 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయంతం చేయాలని సారవకోట పీహెచ్‌సీ వైద్యులు వాన దేవిక సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. సారవకోట పీహెచ్‌సీ పరిధిలో 2,100 మంది చిన్నారులకు 19 బూత్‌లలో పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. 5ఏళ్ల లోపు చిన్నారులకు చుక్కలు వేయుంచుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

ఎల్.ఎన్.పేట: జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పనులు సకాలంలో పూర్తిచేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ కె రమేష్ సూచించారు. గురువారం పలు గ్రామాల్లోని లబ్ధిదారులను కలిశారు. పనులు పూర్తిచేయటంలో జాప్యం వహిస్తే బిల్లుల చెల్లింపు ఆలస్యం అవుతుందన్నారు. ఇప్పటికే పనులు పూర్తిచేసుకున్న లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. తురకపేట, దబ్బపాడు, బొత్తాడసింగి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు వెడల్పు పనుల కారణంగా శుక్రవారం స్తంభాలు వేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.భయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కె.వి ఆమదాలవలస సబ్-స్టేషన్ పరిధిలో స్తంభాలు, విద్యుత్ లైన్ పనులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్‌సూపరింటెండెంట్ ఆకెళ్ల రామారావు గురువారం ప్రకటనలో వెల్లడించారు. ఈ పరీక్ష కేంద్రానికి వెంకటసాయి ప్రైవేట్ జూనియర్ కళాశాల, రొట్టవల మహిళా జూనియర్ కళాశాలలకు చెందిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన 494 మంది జనరల్, 15 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరవుతారన్నారు.

బూర్జ: మండలంలో ఇంటర్మీడియెట్ ప్రథమ పరీక్షలకు 276 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయం ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఓ.వి.పేట గ్రామ ఏపీ మోడల్ స్కూల్, కొల్లివలస కేజీబీవీ, కొల్లివలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయం నుంచి విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలియజేశారు.

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో ఆరు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, తామరాపల్లి రెసిడెన్సియల్ కళాశాల, పద్మావతి, సంపత సాయి, జ్ఞాన జ్యోతి, ఎంఎల్ఆర్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహణకు సెంటర్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి తెలిపారు.

హిరమండలం: ఇంటర్ పరీక్షలకు సంబంధించి పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పట్నాయక్ తెలిపారు. గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఈ పరీక్ష కేంద్రంలో హిరమండలం, ఎల్.ఎన్.పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు కేజీబీవీ విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.